క్లుప్తంగా

మానసిక ఆరోగ్యంపై అపోహలు వద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యురాలు సాహిత్య

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేజిక్ బస్ ఇండియా ఆధ్వర్యంలో వరల్డ్ నేషనల్ డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాహిత్య పాల్గొని విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మానసికంగా బలంగా ఉండాలన్నారు. ఎలాంటి ఒత్తిడినైనా ఎదుర్కోవడానికి సిద్ధపడాలన్నారు. ఒత్తిడికి గురైనప్పుడు నిరుత్సాహం విడిచిపెట్టి ధైర్యంగా ఉండాలన్నారు. మానసిక ఆరోగ్యం విషయంలో అపోహలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు భవానీ, ఉపాధ్యాయులు, మేజిక్ బస్ ఇండియా సంస్థ ప్రతినిధులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అవగాహన అవసరం

ఆరిలోవ : కంటి సమస్యలపై వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఆస్పత్రికి కంటి సమస్యలపై వచ్చిన వృద్ధులకు అక్కడి నర్సింగ్ అసిస్టెంట్లు జాగ్రత్తలు తెలియజేశారు. ఎక్కువగా వృద్ధులకు దృష్టి లోపంతోపాటు జ్ఞాపక శక్తి, వినికిడి లోపాలు ఉంటాయన్నారు. అందుకే ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లినా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అవినాష్ పతంగే మాట్లాడుతూ వృద్ధులు అదుపు ప్పి కింద పడినప్పుడు కంటికి గాయాలయ్యే ప్రమాదం ఉందన్నారు. నడిచేటప్పుడు చేతి కర్ర సహాయం తీసుకోవాలని, ఇంట్లో పూర్తి స్థాయిలో కనిపించే విధంగా లైటింగ్ ఉండాలని, మెట్లు దిగడానికి రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

సంపత్ వినాయగర్ ఆదాయం రూ.22.21 లక్షలు

మహారాణిపేట : ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 33 రోజులకు గాను రూ.22,21,967, వెండి 153 గ్రాములు లభించిందని ఈవో, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళస్ తెలిపారు. యుఎస్ఏ డాలర్స్ 76, కెనడా డాలర్స్ 10 వచ్చాయన్నారు. ఆదాయ లెక్కింపును శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవాలయం ఈవో కీర్తి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మధ్యవర్తిత్వ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ-లీగల్ : జిల్లాలో 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కోసం అర్హులైన సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, సబ్జెక్టు నిపుణులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల జిల్లాలో గల సంబంధిత న్యాయవాదులు సంఘం నుంచి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

మందుల ధరలు తగ్గించి విక్రయించాలి

మహారాణిపేట: జీఎస్టీ 2.0 ప్రకారం వైద్య ఆరోగ్యశాఖలో పలు మార్పులు సంభవించాయని, అందులో భాగంగా అనేక మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని, ఆ ధరలకే ఔషధాల విక్రయాలు జరగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం చిత్రాలయ థియేటర్ దగ్గర జోన్-4 కార్యాలయ భవనం బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో జీఎస్టీ 2.0 మీద ప్రైవేట్ ఆస్పత్రులు, ఇన్సూరెన్స్ యాజమాన్యంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5 శాతం అత్యవసర మందుల ధరలు తగ్గించారని అన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్స్ నిర్వాహకులు మారిన ధరల అమలుకు సహకరించాలన్నారు. ఈ సమావేశాం అనంతరం ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ బిల్ జంక్షన్ సమావేశ మందిరం నుంచి జగదాంబ కూడలి మీదుగా తిరిగి బిల్ జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఆర్.రమేష్, కమిషనర్ సీతాలక్ష్మి, జీఎస్టీకి చెందిన శ్రీనివాస్, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, నోడల్ అధికారులు ఐ.వి.దిలీప్, పి.వి.అభినవ్ పాల్గొన్నారు.

సేవలు.. స్వచ్ఛతలో అగ్రగామి





ఎంవీపీ రైతు బజార్ సాధించిన ఐఎస్‌వో 2015 అవార్డు, స్వచ్ఛ రైతు బజార్ సర్టిఫికెట్లు



ఎంవీపీ రైతు బజార్ ముఖద్వారం

- వరుస అవార్డులతో ఎంవీపీ రైతు బజార్‌కు రాష్ట్ర స్థాయి గుర్తింపు
- పారిశుధ్యం, వినియోగదారులకు సేవల్లో ప్రత్యేక రికార్డ్
- ఈ ఏడాది స్వచ్ఛ రైతుబజార్ అవార్డు దక్కించుకున్న వైనం
- ఆదాయార్జనలోనూ అగ్రగామిగా నిలుస్తున్న వైనం



మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



వినియోగదారులతో కిటకిటలాడుతున్న ఎంవీపీ రైతు బజార్



ఇటీవల సీఎం చేతుల మీదుగా స్వచ్ఛ రైతు బజార్ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంటున్న ఎంవీపీ రైతు బజార్ ఈవో తదితరులు

ఎంవీపీ కాలనీ : రైతుల ఆర్థిక స్వావలంబన... వినియోగదారులకు పారదర్శకమైన సేవలు... మెరుగైన పారిశుధ్యం... ఇలా అన్నింటా ఎంవీపీ కాలనీ రైతు బజార్ రాష్ట్రంలో అగ్రగామిగా నిలుస్తోంది. స్వచ్ఛభారత్, పారిశుధ్యం, కాలుష్యం, ప్లాస్టిక్ నియంత్రణ.. ఇలా ప్రభుత్వ ఆదేశం ఏదైనా తూచా తప్పకుండా పాటిస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది. ఆయా రంగాల్లో ప్రభుత్వం అందించే అవార్డులను వరుసగా గెలుచుకుంటూ సత్తా చాటుతోంది. రాష్ట్రంలో తొలి మోడల్ రైతు బజార్‌గా నిలవడంతోపాటు ఐఎస్ఐ ర్యాంకింగ్‌తో వినియోగదారులకు సేవలు అందిస్తోంది. ఇటీవల స్వచ్ఛ రైతుబజార్‌గా అవార్డు కైవసం చేసుకుని మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా సత్తా చాటింది.

ఆదాయంలోనూ అగ్రగామిగా..

రైతుల ఆర్థిక స్వావలంబనతోపాటు జిల్లా మార్కెటింగ్ శాఖకు ఆదాయాన్ని చేకూర్చడంలోనూ ఎంవీపీ రైతు బజార్ అగ్రగామిగా నిలుస్తోంది. ప్రతీ నెల రూ.8.9 లక్షల వరకు ఆదాయం ఎంవీపీ రైతు బజార్ నుంచి సమకూరుతోంది. రైతులకు పూర్తిస్థాయిలో ఉచితంగా సేవలు అందిస్తుండగా పార్కింగ్ ద్వారా రూ.2 లక్షలు, డ్వాక్రా స్టాల్స్ ద్వారా రూ.1.7 లక్షలతో పాటు ఫ్రూట్స్ స్టాల్స్, కోల్డ్ స్టోరేజ్, రైఫినింగ్ ఛాంబర్ తదితర సౌకర్యాల ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. దీంతో అటు సేవల్లో... ఇటు ఆదాయార్జనలోనూ రైతు బజార్ అగ్రగామిగా నిలుస్తోంది.

సౌకర్యాల కల్పనలో ముందంజ

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుబజార్లలో విశాఖలోని ఎంవీపీ కాలనీ రైతు బజార్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 190 స్టాల్స్, 324 మంది రైతులతోపాటు రోజూ సుమారు 5 వేల మంది వినియోగదారులకు సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే అతిపెద్ద బజార్‌గా ఎంవీపీ రైతు బజార్ అగ్రగామిగా నిలిచింది. దీంతోపాటు మెరుగైన పారిశుధ్య నిర్వహణ, గిరిజన రైతులకు వసతిగృహాలు, చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి, కోల్డ్ స్టోరేజ్, పండ్లు నిల్వ చేసే రైఫినింగ్ ఛాంబర్, సీసీ కెమెరాలు, తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ సేవలు ఎంవీపీ రైతుబజార్‌లో అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు ఫిష్ ఆంధ్ర చేపల విక్రయాల స్టాల్స్, ఆర్గానిక్ ఉత్పత్తుల స్టాల్స్ వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. ఆయా అత్యాధునిక సౌకర్యాలతో వినియోగదారులకు విలువైన సేవలు అందిస్తున్న ఎంవీపీ రైతుబజార్ ఆయా సేవల గుర్తింపునకు రాష్ట్ర స్థాయి అవార్డులను అందుకుంటోంది. ఇప్పటికే ఎంవీపీ రైతు బజార్‌కు ఐఎస్‌వో 2015 గుర్తింపు ఉండగా స్వచ్ఛ రైతు బజార్, ఉత్తమ రైతు బజార్ వంటి అవార్డులు అందుకుంటూ సేవలు, సౌకర్యాల కల్పనలో అగ్రగామిగా నిలుస్తోంది.

మెరుగైన సేవలే లక్ష్యం



ఎంవీపీ రైతు బజార్ ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రైతుల కుటుంబాలకు ఆర్థిక స్వావలంబనతోపాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే మా ప్రధాన లక్ష్యం. ఎంవీపీ రైతు బజార్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్‌శాఖ అధునాతన సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. వాటి సేవలను నిత్యం వినియోగదారులు, రైతులు వినియోగించుకుంటున్నారు. రైతులకు, వినియోగదారులకు న్యాయపరమైన సేవలు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఇందులో భాగంగానే ఎంవీపీ రైతు బజార్‌కు రాష్ట్ర స్థాయి అవార్డులతో మంచి గుర్తింపు లభిస్తోంది.

– వరహాలు, ఎస్టేట్ ఆఫీసర్, ఎంవీపీ రైతు బజార్

నిరాశ్రయ వసతి గృహాలకు అండగా నిలవాలి



ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవంలో పాల్గొన్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తదితరులు

అల్లిపురం: స్వచ్ఛంద సంస్థలు నిరాశ్రయ వసతి గృహాలకు, పోలీసు డిపార్టుమెంట్‌కు అండగా నిలవాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా కేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు, ఎంవీపీ సెక్టర్-6, హెల్త్ ఎరీనా ప్రతినిధులు గురువారం నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు సీపీ చేతుల మీదుగా అందజేశారు. నిరాశ్రయులకు బాసటగా నిలుస్తున్న ఏయూటీడీ లాంటి సంస్థలకు, పోలీస్ డిపార్టమెంట్‌కు దాతలు అండగా నిలవాలని సీపీ కోరారు. నిరాశ్రయుల దినోత్సవం రోజున సహాయం అందించిన అకాడమీ సభ్యులు సుందర రామరాజు బృందాన్ని అభినందించారు. దాతలను సమీకరించిన 2 టౌన్ సీఐ ఎర్రంనాయుడు, సిబ్బందిని అభినందించారు. నిరాశ్రయులు, షెల్టర్ సిబ్బంది, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. అకాడమీ సభ్యులు జి.ఎస్.ఎన్ రాజు (బీఎస్ఎన్ఎల్), సత్యనారాయణ, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సఖి సురక్ష



సఖి సురక్ష పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, మెప్మా అధికారులు

ఆరిలోవ : మెప్మా అధికారుల ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ సాగరిక సమావేశ మందిరంలో సఖి సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవన శైలి, మానసిక ఆరోగ్యంపై మెప్మా అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, మెప్మా అధికారులు సఖి సురక్ష పోస్టర్ ఆవిష్కరించారు.

వినియోగదారులకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు

విశాఖ-లీగల్ : వినియోగదారుల హక్కుల చట్టం ప్రజలకు న్యాయం అందించడానికి ఒక బలమైన సాధనం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ మీటింగ్ హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరులందరికీ వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరమని, ముఖ్యంగా గ్రామీణ స్థాయిలో ప్రజలు తమ హక్కులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వినియోగదారుల ఫోరం-2 జడ్జి వెంకటేశ్వరి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జననేత గర్జనకు వైఎస్సార్ సీపీ శ్రేణులు

మెడికల్ కాలేజ్ వద్దకు భారీగా తూర్పు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు



13వ వార్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆరిలోవ : అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో వైఎస్సార్ సీపీ పాలనలో నిర్మాణం ప్రారంభించిన మెడికల్ కళాశాల సందర్శనకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన సందర్భంగా తూర్పు నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో వందలాది మంది వైఎస్సార్‌సీపీ జెండాలతో బయలుదేరి విమానాశ్రయం వద్ద వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలతో మెడికల్ కళాశాల వద్దకు చేరుకున్నారు. నియోజకవర్గంలోని జీవీఎంసీ 9, 10, 11, 12, 13వ వార్డుల నుంచి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షుల ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. తొమ్మిదో వార్డులో కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి, పదో వార్డులో పార్టీ అధ్యక్షుడు పతివాడ కనకరాజు, పదకొండో వార్డులో మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, నాయకుడు గొలగాని శ్రీనివాస్, పన్నెండో వార్డు అధ్యక్షుడు మొల్లి హేమంత్, పదమూడో వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ కార్యకర్తలతో కలిసి గురువారం ఉదయం బయలుదేరి ర్యాలీగా వెళ్లారు. దీంతో అటు ఆరిలోవ కాలనీ నుంచి ఇటు విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం వరకు వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, వార్డు స్థాయి నాయకులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జీవీఎంసీ 28వ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వార్డు నుంచి కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు.

మద్దిలపాలెం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు నాయకత్వంలో నియోజకవర్గంలోని వివిధ వార్డుల నుంచి కార్లు, బైక్‌లు, ఆటోలతో కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రాజబాబు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు కంట్రెడ్డి రామన్నపాత్రుడు, కార్యదర్శి చొక్కర శేఖర్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు బోని శివరామకష్ణ, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి గూడపాటి విక్టర్, రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి, పీతల గోవింద్, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గుడ్ల గణేష్ రెడ్డి, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి వానపల్లి ఈశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కష్ణంరాజు, తూర్పు మహిళ విభాగం అధ్యక్షురాలు కె.శిరీష తరలివెళ్లారు.



స్వాగతం పలికేందుకు వెళ్తున్న పల్లా దుర్గారావు, తదితరులు



జీవీఎంసీ పదో వార్డు వివేకానందనగర్ నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు వెళ్లిన మొల్లి అప్పారావు, నాయకులు, కార్యకర్తలు

చెల్లింపులు ఎన్నడో..?

- స్టీల్‌ప్లాంట్ నుంచి 464 మంది ఉద్యోగులకు వీఆర్ఎస్
- విధుల నుంచి వైదొలిగిన 9వ రోజున 25 శాతమే పరిహారం చెల్లింపు
- మిగిలిన మొత్తం వాయిదాల్లో చెల్లిస్తామంటున్న యాజమాన్యం
- గతంలో వీఆర్ఎస్ తీసుకున్న వారికి ఒకే విడతలో పరిహారం చెల్లింపులు
- యాజమాన్యం తీరుపై వీఆర్ఎస్ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) ఉద్యోగులకు పూర్తి స్థాయిలో ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులపై సందిగ్ధత నెలకొంది. వీఆర్ఎస్ తీసుకున్న రోజున పూర్తి చెల్లింపులు జరుగుతాయని భావించిన ఉద్యోగులకు తొమ్మిది రోజులకు 25 శాతం చెల్లింపులు జరగడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా పర్మినెంట్ ఉద్యోగుల తగ్గింపు, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఉద్యోగుల తగ్గింపు కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్)కు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మార్చి నెలలో అమలు చేసిన వీఆర్ఎస్ – 1లో 1100 మంది ఉద్యోగులు బయటకు వెళ్లిపోయారు. మార్చి 31న వెళ్లిన ఉద్యోగులకు అదే రోజు సాయంత్రం వీఆర్ఎస్ పరిహారం చెల్లించేశారు.

అనంతరం విడతల వారీగా పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ శాలరీలను కూడా అందజేశారు. దీంతో వీఆర్ఎస్ – 1 ఉద్యోగుల్లో ఆనందం కనిపించింది.

రెండో విడతలో 464 మందికి తీవ్ర నిరాశ

స్టీల్‌ప్లాంట్‌లో రోజురోజుకూ జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో చాలా మంది ఉద్యోగుల్లో అసంతృప్తి. కంపెనీ బాగుపడుతుందన్న నమ్మకం లేకుండా పోయింది. దీనికితోడు ఉక్కు యాజమాన్యం ఉద్యోగులకు 355 శాతం జీతం పెండింగ్ పెట్టింది. ఈ పరిస్థితుల్లో ఉక్కు యాజమాన్యం రెండో విడత వీఆర్ఎస్‌ను ప్రకటించింది. దీంతో సుమారు 1100 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో వడపోత అనంతరం 464 మంది ఉద్యోగుల వీఆర్ఎస్‌కు ఆమోదం తెలిపారు. సెప్టెంబర్ 30న వారికి ఆఖరి పని దినం కాగా అక్టోబర్ 1న అందుకు సంబంధించిన పత్రాలు అందజేశారు.

ఆ రోజు పేమెంట్ వస్తుందని ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే ఎదురైంది. కనీసం 3వ తేదీన అయినా చెల్లిస్తారని ఎదురుచూశారు. ఆ రోజు కూడా చెల్లింపులు జరగకపోవడంతో వారిలో ఆందోళన వ్యక్తమైంది. వీఆర్ఎస్ – 1 సమయంలో ఉద్యోగులకు చెల్లించినట్లే తమకూ ఉక్కు యాజమాన్యం చెల్లిస్తుందని భావించిన వారికి నిరాశే ఎదురైంది. విధుల నుంచి వైదొలిగిన తర్వాత తొమ్మిదో రోజున అక్టోబర్ 9న గురువారం కేవలం 25 శాతం పరిహారం చెల్లించడంతో ఆ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇలా చేస్తారనుకోలేదు..

వీఆర్ఎస్ – 1 రాక ముందు ఆర్థిక ప్రయోజనాల చెల్లింపులపై మాకు అనేక అనుమానాలు ఉండేవి. వీఆర్ఎస్ – 1 అమలు సమయంలో ఉద్యోగుల విధి నిర్వహణ చివరి రోజున పరిహారం మొత్తం చెల్లించేయడంతో మాకు నమ్మకం కుదిరింది. అందువల్లే రెండోసారి వీఆర్ఎస్ అమలు చేసినప్పుడు దరఖాస్తు చేసుకున్నాం. అయితే యాజమాన్యం మొత్తం పరిహారాన్ని సకాలంలో చెల్లించకపోవడం అన్యాయం. విడతల వారీగా కాకుండా ఒకేసారి పరిహారమిస్తే మా అవసరాలకు ఉపయోగపడుతుంది. యాజమాన్యం నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి.

– వీఆర్ఎస్ ఉద్యోగి, స్టీల్‌ప్లాంట్

నాలుగు వాయిదాల్లో చెల్లిస్తామనడంపై అసంతృప్తి

ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల్లో జాప్యంపై వీఆర్ఎస్ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్మిక సంఘాల నాయకులు, అధికార వర్గాలను వారంతా కలిసి విచారించారు. వారు యాజమాన్యం నుంచి తీసుకున్న సమాచారం మేరకు షాక్ ఇచ్చే వార్త వినిపించింది. పరిహారం ఒకే సారి కాకుండా వాయిదాల పద్ధతిలో చెల్లించనున్నట్టు సమాచారం తెలిసింది. 25 శాతం చొప్పున నాలుగు వాయిదాల్లో ఇవ్వనున్నట్టు కార్మిక వర్గాల సమాచారం. దీంతో వీఆర్ఎస్ తీసుకున్న ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. చివరి పని దినం నాడు చెల్లించాల్సిన మొత్తం పరిహారాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామనడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని వారంతా వేడుకుంటున్నారు.

వీధి దీపం వెలగక అంధకారం



పెదగదిలి ప్రాథమిక పాఠశాల గేటు వద్ద రెండేళ్లుగా వెలగని వీధి దీపం

ఆరిలోవ : జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి పెదగదిలి సర్వీస్ రోడ్డులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రవేశ ద్వారం పక్కన విద్యుత్ దీపం వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. రెండేళ్లుగా ఇక్కడి వీధి దీపం వెలగడం లేదు. దీనిపై పలుసార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దీపం వెలగకపోవడంతో చీకటిలో స్థానికులు ఇబ్బంది పడడంతోపాటు రాత్రి వేళల్లో పాఠశాలలోకి ఆకతాయిలు చొరబడుతున్నారు. చీకటి కావడంతో ఎవ్వరికీ కనిపించకుండా గుట్టుగా గేటు ఎక్కి లోపలకు ప్రవేశించి మద్యం, గంజాయి తాగుతున్నారని స్థానికులు అంటున్నారు. రోజూ పాఠశాల తెరిచేసరికి గంజాయి, వ్యర్థాలతో అస్తవ్యస్తంగా ఉంటుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇక్కడ వీధి దీపాలు వెలిగిస్తే ఆకతాయిల అల్లరికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి దీపాలు వెలిగించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జ్ఞానాపురంలో అన్నదానం

కంచరపాలెం: జ్ఞానాపురం న్యూ రైల్వే స్టేషన్ రహదారిలో ఆటో, ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మహా అన్నసమారాధన నిర్వహించారు. 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు శ్రీధర్ హాజరై అన్న సమారాధనను ప్రారంభించారు. సుమారు 5 వేల మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు.